


శ్రీరామనవమి వేడుకల్లో ఎస్‌పి దంపతులు

శ్రీకాకుళం: ఎచ్చెర్లలోని పోలీస్ ఆర్మ్స్ మైదానంలో ఉన్న కోదండ రామాలయంలో నిర్వహించిన సీతారామ కళ్యాణంలో ముఖ్య అతిథులుగా ఎస్‌పి జిఆర్ రాధిక దంపతులు పాల్గొన్నారు. సీతారాముల ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించి, కళ్యాణం నిర్వహించారు. జిల్లా ప్రజలు, పోలీస్ సిబ్బంది సుఖసంతోషాలతో, సిరిసంపదలతో ప్రశాంతంగా జీవించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి టిపి విఠలేశ్వర్, డిఎస్‌పిలు ఎస్.బాలరాజు, డి.ప్రసాద్‌రావు, ఆర్ఐలు ప్రదీప్, ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది, కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎస్‌పి దంపతులు

80 శాతమే

- రబీలో తగ్గిన సాగు విస్తీర్ణం
- సాధారణ విస్తీర్ణం 2,24,930 ఎకరాలు
- ఈ సీజన్‌లో 1,79,582.5 ఎకరాల్లోనే పంటలను వేయగలిగిన రైతులు
- వర్షాభావ పరిస్థితులతో తగ్గిన సాగు
- అపరాల సాగుపై తీవ్ర ప్రభావం

రబీలో ఈ ఏడాది పంటల సాగు అంత ఆశాజనకంగా లేదు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో సాగు గణనీయంగా తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి ఏడాది డిసెంబర్‌లో కురిసే వర్షాలతో నేలలో తేమ శాతం పెరిగి అపరాల సాగుకు దోహదపడుతుంది. ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపిందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతికూలపరిస్థితులు నెలకొనడంతో పాటు మరోవైపు ప్రభుత్వం నుండి కూడా రైతులకు సహకారం కొరవడుతోంది. పంటల సాగుకు సరిపడా ఎరువులను సరఫరా చేయడంలో విఫలమయ్యిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



రబీలో సాధారణంగా అన్ని రకాల పంటలు కలిపి మొత్తం 2,24,930 ఎకరాల్లో సాగవుతోంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 1,79,582.5 ఎకరాల(80శాతం) మేర సాగైంది. వరి సాధారణం కంటే అధిక విస్తీర్ణంలో సాగైంది. రబీలో వరి సాధారణ సాగు 18,142.5 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 20.362.5 ఎకరాలు (112శాతం) వరకు వేశారు. మొక్కజొన్న పంట సాగులో పెరుగుదల కనిపిస్తోంది. రబీలో సాధారణంగా 36,182.5 ఎకరాల్లో సాగవుతుండగా ఇప్పటివరకు 43,307.5 ఎకరాల విస్తీర్ణంలో సాగైంది. రాగులు సాధారణ సాగు విస్తీర్ణం 5,547.5 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 5,490 ఎకరాలో (99శాతం) సాగవుతోంది. వేరుశనగ పంట సాధారణంగా 11,157.5 ఎకరాల్లో సాగవుతుండగా ప్రస్తుతం 10,087.5 ఎకరాల్లో (90శాతం)సాగైంది.

గణనీయంగా తగ్గిన అపరాల సాగు

డిసెంబర్‌లో వర్షాలు పెద్దగా లేకపోవడంతో అపరాల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నేలలో తేమ శాతం తక్కువగా ఉండటంతో మినుము, పెసర పంటలను వేయలేకపోయారు. రబీలో పెసర సాధారణ సాగు 52,025 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 32,022.5 ఎకరాల్లో (61.47శాతం) ఎకరాల్లో సాగైంది. మినుములు సాధారణంగా 76,037.5 ఎకరాలు ఉండగా 52,300 ఎకరాల్లో (69శాతం) సాగైనట్లు నమోదైంది. చెరకు పంట కూడా గణనీయంగా తగ్గింది. రబీలో సాధారణ సాగు 4,367.5 ఎకరాలు ఉండగా ఇప్పటివరకు కేవలం 680 ఎకరాలు (16 శాతం) సాగైంది. నువ్వులు పంటను సాధారణంగా 15,330 ఎకరాల్లో వేస్తుండగా ప్రస్తుతం 5,745 ఎకరాలు (37శాతం) మేర వేశారు.

కట్టె జనుము సాగుపై ఆసక్తి

ఈ సంవత్సరం రబీలో కట్టె జనుముపై రైతులు ఆసక్తి చూపారు. పంటలకు పచ్చిరొట్ట విత్తనాలుగా రైతులు ఉపయోగిస్తుండటంతో మంచి డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. పంట లాభదాయకంగా ఉండటంతో లక్ష్యానికి మించి రైతులు వేసినట్లు అధికారులు చెప్తున్నారు. సాధారణంగా రబీలో 950 ఎకరాల్లో కట్టె జనుము సాగవుతుండగా 7,310 ఎకరాలు (769శాతం) మేర సాగు నమోదైంది.

ఈకెవైసిలో వెనుకబాటు

రబీ పంటల సాగుకు సంబంధించి రైతుల వివరాలు సేకరించడంతో చాలా వెనుకబాటు కనిపిస్తోంది. రబీలో పంటలు సాగు చేసిన 1,24,554 మంది రైతులకు సంబంధించి 1,76,362 ఎకరాలను ఈకెవైసి చేయించాల్సి ఉండగా ఇప్పటివరకు 1,11,969 మంది రైతులకు చెందిన 1,64,340 ఎకరాలు (93శాతం) రైతుల నుంచి వివరాలు తీసుకున్నారు. పంటల ఈ-క్రాప్ బుకింగ్‌కు సంబంధించి మాత్రం బాగానే సాగింది. 1,77,428 ఎకరాలను బుకింగ్ చేయాల్సి ఉండగా 1,76,362 ఎకరాలు (99.4శాతం) బుక్ చేశారు.

వరికి సాగునీరందేనా

వరి పంటకు సాగునీరందడంపై అనేక సందేహాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత సీజన్‌లో మరో పది రోజులు మాత్రమే నీరందించగలమని వంశధార ప్రాజెక్టు అధికారులు చెప్తున్నారు. మరోవైపు వరి పంట ఎన్ను దశలో ఉంది. ఈ సమయంలో నీరందకపోతే దిగుబడిపై ఎండిపోయే ప్రమాదముంది. హిరమండలం మండలం గొట్టా బ్యారేజీ వాస్తవ సామర్థ్యం 0.66 టిఎంసిలు ఉండగా ప్రస్తుతం 0.27 టిఎంసిల నీరే లభ్యమవుతోంది. వంశధారలో క్రమేణా నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. దీంతో కాలువల ద్వారా చివరి వరకు నీరందే అవకాశాలు లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్మిక, కర్షక హక్కుల కోసం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీలో జరిగే కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ప్రసాదరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావుతో కలిసి గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మార్చి 31, ఏప్రిల్ 1న బైక్ ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తోందని విమర్శించారు. కార్మిక హక్కులు కాలరాస్తూ పెట్టుబడిదారులకు కార్మికులను బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, స్కీం వర్కర్లు, డైలీవేజ్ కంటింజెంట్ ఉద్యోగులు, కార్మికుల రెగ్యులరైజేషన్, సిపిఎస్ రద్దు, ఒపెస్ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేసారు. కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, కేరళ తరహా రైతు రుణమాఫీ చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2022 రద్దు చేయాలని, ఎరువుల సబ్సిడీని పెంచాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి భరోసా, పరిహారాలు ఇవ్వాలని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీకి రూ.3లక్షల కోట్లు కేటాయించి 14 రకాల సరుకులు సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, మోనిటైజేషన్ పైప్‌లైన్ రద్దు చేయాలని తెలిపారు. పై డిమాండ్ల సాధనకు ఏప్రిల్ 5న కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా కార్యదర్శి ఎన్‌వి.రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.తేజేశ్వరరావు

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు (6లో)

క్రీడలతో పాటు చదువులో రాణించాలి

- ఎస్‌పి జిఆర్.రాధిక
- బొడ్డపాడులో ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పలాస

యువత క్రీడలతో పాటు, చదువులో రాణించాలని జిల్లా ఎస్‌పి జిఆర్.రాధిక అన్నారు. మండలంలోని బొడ్డపాడు గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా కాశీబుగ్గ పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు గురువారం రాత్రితో ముగిసాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె క్రీడా పోటీలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతకు క్రీడలు ఎంతో అవసరమని, భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. క్రీడల వల్ల క్రీడాకారుల్లో స్నేహభావం పెరుగుతుందన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను తేలిగ్గా తీసుకోవాలని సూచించారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఉన్న క్రీడాకారులందరూ గ్రామస్థాయి నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. గ్రామాల్లో నేరాలు జరిగే సమయంలో జరిగిన ఘటనలను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఘటనను చూసి వెళ్లిపోతే వారు నేరం చేయకపోయినా నేరం చేసిన వారి లెక్కని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సృష్టిలో మానవ జన్మ ఎంతో మహోన్నతమైనదని, మానవ జన్మను ప్రతి ఒక్కరూ సార్థకం చేసుకోవాలన్నారు. యోగ వంటి మంచి అలవాట్లతో పాటు సేవా కార్యక్రమంలో విరివిగా పాల్గొవాలన్నారు. బొడ్డపాడు అంటే పోలీసులు సైతం వచ్చేందుకు భయపడేవారని, అటువంటి ప్రాంతంలో క్రీడా పోటీలు నిర్వహించడం, అందుకు సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు, యువత సహాయ సహకారాలు అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముందుగా ఎస్‌పికి కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి, కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తామడ మధన్, ఎంపిటిసి ఎం.పాపారావు, సరోజ వర్మ, పిఇటిలు , పోలీసు ఉన్నతాధికారులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వాలీబాల్ విజేత బేతాళపురం క్రీడాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్‌పి రాధిక

వాలీబాల్ విజేత బేతాళపురం

జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా సాగాయి. వాలీబాల్ పోటీల్లో మందస మండలం బేతాళపురం ప్రథమ స్థానంలో నిలువగా, పుత్తూరు మండలం సైనూరు ద్వితీయ స్థానం, మూడో స్థానంలో పల్లి సారథి, బాతుపురం నిలిచాయి. క్రికెట్‌లో ప్రథమ స్థానంలో పలాస మండలం మాకనపల్లి, ద్వితీయ స్థానంలో బొడ్డుపాడు టీమ్‌లు నిలిచాయి. బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో పథమ స్థానంలో సానివాడ, రెండో స్థానంలో ఎచ్చెర్ల, మూడో స్థానంలో పలాస మండలం బ్రాహ్మణతర్ల, బాలుర విభాగంలో మొదటి స్థానంలో కాశీబుగ్గ, రెండవ స్థానంలో ఎచ్చెర్ల, మూడో స్థానంలో టెక్కలి నిలిచాయి. గెలుపొందిన విజేతలకు ఎస్‌పి నగదుతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

పనిచేయని సర్వర్లు

- డిమాండ్ నోటీసులు లేకుండా రాయితీ
- అపరాధ రుసుం లేకుండా చెల్లింపునకు నేడు ఆఖరు
- అయోమయంలో ప్రజలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



నగర, పుర ప్రజలు ఆస్తి పన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తే వారికి అపరాధ రుసుం చెల్లించకుండా రాయితీ వర్తింపజేస్తామని పురపాలకశాఖ ప్రకటించింది. నగరపాలక సంస్థతో పాటు చుట్టూ ఉన్న విలీన పంచాయతీలతో కలుపుకుని భారీ ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు అధికారులు సిద్ధపడ్డా అన్నీ అనుకూలంగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుత ఏడాది ఎంత పన్ను చెల్లించాలో సూచిస్తూ డిమాండ్ నోటీసులు సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో పెట్టక పోవటంతో ప్రజల్లో అయోమయం నెలకొంది. ఒకవైపు అధికారులకు ముందస్తు పన్నుల వసూళ్లపై లక్ష్యాలు ఉండటంతో వారు సైతం పురపాలకశాఖ సర్వర్ ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూడాల్సి వస్తోంది. పన్ను డిమాండ్ నోటీసుల కోసం ప్రజలు నిత్యం నగర, మున్సిపల్ కార్యాలయాలతో పాటు సచివాలయాలకు వచ్చి అవి రాలేదని తెలుసుకుని వెనుదిరుగుతున్నారు. మార్చి 31 అర్ధరాత్రి నుంచి పన్నుల సర్వర్ మూసుకుపోతుందన్న భయం వెంటాడుతోంది.. దీంతో వడ్డీ రాయితీ కోల్పోవాల్సి వస్తుందన్న భయం వారిని వెంటాడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన మొత్తం పన్ను రుసుములను మార్చి 31లోపు ఒకేసారి చెల్లిస్తే మొత్తం పన్నుపై వడ్డీ రాయితీని ప్రభుత్వం కల్పించింది.

రెండేళ్ల నుంచి మున్సిపల్ ప్రాంతాల్లో ఆస్తి పన్నులను ఆస్తి మూల విలువ(క్యాపిటల్ వాల్యూ సిస్టం) లెక్కించి ఆమేరకు పన్నులు వసూలు చేసే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానంలో పాత పన్నుపై గరిష్టంగా ఏడాదికి 15 శాతం మాత్రమే పెరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఉదాహరణకు గతేడాది రూ.వెయ్యి చెల్లిస్తే ఈ ఏడాది ఆ మొత్తం పై 15 శాతం అంటే రూ.150 పెరగాలి. అంటే రూ.1150కు పన్ను డిమాండ్ నోటీసు ఇవ్వాలి. ఆ పెరిగిన పన్ను మొత్తంతో కూడిన డిమాండ్ నోటీసులు సిద్ధంచేసి ఇవ్వటానికి తగినంత సిబ్బంది కార్పొరేషన్‌లో లేక సచివాలయాలకు, కార్పొరేషన్ సిబ్బందికి మధ్య సమన్వయం లేక ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నగరంలో మొత్తం అసెస్‌మెంట్ 40,561

డిమాండ్	: రూ.25.66 కోట్లు
ఈ ఏడాది వసూళ్లు	: రూ.19.72 కోట్లు
గత ఏడాది వసూళ్లు	: రూ.14.43 కోట్లు

ఆస్తి పన్ను కట్టే సదుపాయం లేదు

గతంలో ఖాళీ స్థలం పన్ను(విఎల్‌డిటి) చెల్లించి దాని ఆధారంగా ప్లాన్ తీసుకుని భవనాలు నిర్మించుకున్న వారు ప్రస్తుతం ఆస్తి పన్ను వేయించుకోవాలంటే తొలుత వారు విఎల్‌టిఎ మాత్రం పెండింగ్ లేదని సూచించి ఆన్‌లైన్‌లో బదలాయించాలి. ఆ కన్వర్షన్‌కు సైతం అవకాశం సర్వర్లలో లేక ఇబ్బందులు పడుతున్నారు. భాగస్వాముల మధ్య జరిగిన ఆస్తుల పంపకాలు జరిగి వారి పేరుపై ఆస్తి పన్ను వేసుకోవటానికి అవకాశం లేక అవస్థలు పడుతున్నారు.

నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి కుళాయి కనెక్షన్లు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి పన్నులు చెల్లించుకోవటానికి, పంపకాలు చేస్తున్న ఆస్తులకు సంబంధించి పన్నులు మార్చుకోవటానికి సర్వర్లలో అవకాశం కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

పంచాయతీలపై విద్యుత్ పిడుగు

- నిధులు లేకుండా బిల్లులు చెల్లించడమెలా?
- మదనపడుతున్న సర్పంచ్‌లు

పొందూరు మేజర్ పంచాయతీలో ఒక్క పన్నుల రూపంలో ఏడాదికి రూ.40 లక్షలు వస్తోంది. ఇప్పటివరకు రూ.32 లక్షలు వసూలైంది. పన్నులు, స్టాంప్ డ్యూటీ, వృత్తి పన్ను, ఇతర ఆదాయ మార్గాల ద్వారా పంచాయతీకి మొత్తంగా రూ.కోటి ఆదాయం వస్తోంది. ఇందులో పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రలు, పంపు ఆపరేటర్ల జీతాలకు ఏడాదికి రూ.40లక్షల వరకు ఖర్చవుతోంది. విద్యుత్ బిల్లు నెలకు రూ.2లక్షలు వస్తోంది. ఏడాదికి రూ.24 లక్షలు. ఇటీవల ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.1.50 కోట్లు విద్యుత్ బిల్లు కట్టింది. ఇంకా రూ.40 లక్షల వరకు విద్యుత్ బకాయి ఉంది. ప్రస్తుతం రూ.4లక్షల వరకు విద్యుత్ బిల్లు కట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. పన్నుల ఆదాయం విద్యుత్ బిల్లులకే చెల్లిస్తే సిబ్బందికి జీతాలు, పంచాయతీ నిర్వహణ, మరమ్మతులు, ఇతర అవసరాలకు డబ్బులు ఎక్కడి నుంచి తీసుకురావాలో తెలియక అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు.

కవిటి మేజర్ పంచాయతీకి ఇంటి పన్నులు, ఆశీల వసూళ్లు, తదితర మార్గాల ద్వారా ఏడాదికి సుమారు రూ.17లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఈ ఆదాయం నుంచే పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది, శానిటేషన్ సిబ్బందికి నెలకు సుమారు రూ.1.20 లక్షలు జీతాలుగా చెల్లిస్తున్నారు. దీంతో వచ్చిన ఆదాయం ఎక్కడికక్కడే సరిపోతోంది. మరోవైపు 2021 మార్చి 31 నాటికి 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.27లక్షలను విద్యుత్ బిల్లుల బకాయిల రూపేనా ప్రభుత్వం జమ చేసుకోవడంతో కొత్త పాలకవర్గం జీరో బడ్జెట్‌తో పాలన ప్రారంభించింది. దీంతో పంచాయతీలో ఏ కార్యక్రమం చేపట్టడానికైనా నిధుల లేమి ఏర్పడింది. మరోవైపు ప్రస్తుతం ఉన్న రూ.7.35 లక్షల విద్యుత్ బకాయి తక్షణమే చెల్లించాలని పైనుంచి పంచాయతీ సిబ్బందికి ఒత్తిడి అధికమవుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి 31వ తేదీలోపు విద్యుత్ బకాయి చెల్లించాలని పై అధికారుల నుంచి తీవ్ర స్థాయిలో ఒత్తిడి ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సతమతమవుతున్నారు. అయితే కవిటి మేజర్ పంచాయతీకి పక్క పంచాయతీ సర్వీస్ నెంబర్లు కూడా కలిపి బిల్లు ఇచ్చినట్టు తెలుస్తోంది. మొత్తంగా బిల్లు ఇస్తుంటే తేడా ఉందని, గతంలో కూడా ఈ విధంగా చేసి సుమారు రూ.2లక్షలకు పైగా అధికంగా బిల్లు పంపించినట్లు సమాచారం. దీంతో పంచాయతీ సిబ్బంది సర్వీస్ వారీగా డిమాండ్ ఇస్తే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక 20 నుంచి 30 శాతం విద్యుత్ బకాయిలు చెల్లిస్తామని విద్యుత్ అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. ఇక 2022-23 ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు రెండు విడతల్లో రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల ఉసే ఇప్పటివరకు లేదు. దీంతో పంచాయతీ ప్రగతిని పరుగులు పెట్టించాలన్న ఆశ పాలకవర్గానికి అడియాసగానే మిగులుతోంది.



ప్రజాశక్తి - పొందూరు, కవిటి, నౌపద

మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఉంది గ్రామ పంచాయతీల పరిస్థితి. అసలే నిధుల్లేక అవస్థలు పడుతుంటే తాజాగా ప్రభుత్వం విద్యుత్ బిల్లుల భారం మోపింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 1,110 పంచాతీలుండగా ఇప్పటివరకు సుమారు రూ.320 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కరెంట్ బిల్లుల బకాయి పేరుతో 15వ ఆర్థిక సంఘం నిధులు తీసుకుంటున్న ప్రభుత్వం ఇప్పుడు పంచాయతీల సాధారణ నిధులపై కన్నేసింది. ఆస్తి, నీటి పన్నుల కింద వసూలు చేసిన సొమ్మును తక్షణమే చెల్లించాలని పంచాయతీ కార్యకర్తలను ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఆర్థిక సంఘం నిధులు ఎలాగో ఇవ్వడం లేదని, సాధారణ నిధులూ ఖాళీ చేస్తే పంచాయతీల నిర్వహణ ఎలా చేయ ఆలని సర్పంచులు గగ్గోలు పెడుతున్నారు. ఇక చిన్న నపంచాయతీల ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఆస్తి, నీటి, ఇతర పన్నుల కింద రూ.2 లక్షల నుంచి రూ.11 లక్షల్లోపు వస్తోంది. వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా నిర్వహణకే ఇవి సరిపోవడం లేదు. ప్రస్తుతం సాధారణ నిధులతో విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఆదేశించడంతో పల్లెల్లో అభివృద్ధి పనులపై నీళ్ల చల్లినట్లైంది. ఆ బిల్లులు మినహాయించగా.. మిగిలిన నిధులతో గ్రామాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో తెలియడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నౌపడ మేజరు పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8లక్షలు వస్తున్నాయి. ఇందులో టెక్కలి వీధిలోని సిసి రోడ్డుకు రూ.2.50 లక్షలు, పారిశుధ్యానికి రూ.1.50 లక్షలు, పారిశుధ్య కార్మికుల జీతాలకు రూ.1.75 లక్షలు ఖర్చవుతోంది. తాగునీటి పథకం నిర్వహణకు రూ.80వేలు ఖర్చవుతోంది. వీధి దీపాలు, విద్యుత్ బిల్లులు రూ.1.50 లక్షలు కట్టారు. ఇంకా రూ.1.50 లక్షలు విద్యుత్ బిల్లుల బకాయి ఉంది. వీధి దీపాల నిర్వణకు రూ.50 వేలు ఖర్చయింది. 15వ ఆర్థిక సంఘం నిధులు దేనికీ సరిపోవడం లేదు. ఇటీవల ఇంటి పన్నుపై రూ.3.50 లక్షలు వసూలైంది. పంచాతీయతీకి వస్తున్న ఆదాయం కంటే నిర్వహణకు ఎక్కువ ఖర్చవుతోంది.

సాధారణ నిధుల నుంచి..

సాధారణ నిధుల నుంచైనా విద్యుత్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం దురదృష్టకరం. గతేడాది 15వ ఆర్థిక సంఘం నిధులు మొత్తం దారిమళ్లించింది. ఇప్పుడు కరెంట్ బిల్లులు కట్టాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇవ్వడాన్ని సర్పంచులు వ్యతిరేకిస్తున్నారు. గతంలో మైనర్ పంచాయతీలకు కరెంట్ బిల్లుల రాయితీ ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం వాటి నుంచీ బిల్లులు వసూలు చేయమనడం దారుణమని అంటున్నారు.

టిడిపిలో నూతనోత్సాహం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవంతో ఒక్కసారిగా టిడిపి కేడర్‌లో ఎమ్మెల్యే బెందాళం అశోక్ నూతనోత్సాహం నింపారు. గతంలో ఎన్నడూ లేనంతగా అశోక్ ఈ సారి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. కవిటి, సోంపేట, కంచిలి మండలాల్లో కేడర్ చేపట్టిన ర్యాలీ ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. టిడిపికి అడ్డాగా, కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో మరోసారి టిడిపి సత్తా చూపించి, హ్యాట్రిక్ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసే పనిలో పడింది. అధికార పార్టీ వైసిపి శాసనసభ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయకపోవడం వల్ల ఆ పార్టీ నేతలు దీన్ని పెద్దగా పట్టించుకోవడం లేదని తెలిసింది. వైసిపి యాదవ సామాజిక తరగతిని గుర్తించి ఎమ్మెల్సీ టిక్కెట్ నర్తు రామారావుకు ఇవ్వడంతో ఆ సామాజిక తరగతి నుంచి పెద్దగా వ్యతిరేకత ఉండదని భావిస్తున్నారు.

కానీ ఈసారి టిక్కెట్ పిరియా సాయిరాజ్‌కు ఇచ్చే అవకాశముందని, ఎన్నికల సమీపించే సమయంలో అధికారికంగా ప్రకటిన వస్తుందని ఆ పార్టీ పెద్దలు చెబుతున్నారు. అయితే వైసిపిలోని మరో గ్రూపు రెడ్డి సామాజిక తరగతికి టిక్కెట్ వచ్చే అవకాశముందని భావిస్తోంది. ఈ సారి టిక్కెట్ ఎవరికి దక్కుతుందా అని ఆ పార్టీ కేడర్ ఎదురు చూస్తోంది. టిక్కెట్ సందిగ్ధంలో వైసిపి ఉంటే టిడిపి ఇదే అవకాశంగా చూసుకొని నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే పనిలో నిమగ్నమైంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టిడిపి విజయం సాధించడంతో కేడర్‌లో ఉత్సాహం పెరిగింది. అదే జోష్‌ను కేడర్‌లో నింపాలని ఎమ్మెల్యే అశోక్ ఆవిర్భావ దినోత్సవాన్ని వేదికగా చేసుకొన్నారు. టిడిపిలో సమిష్టి కృషి చేస్తే మరోసారి తమ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని టిడిపి శ్రేణులకు నమ్మకం కుదిరింది. మొత్తం మీద టిడిపి ఆవిర్భావ వేడుకలతో కేడర్‌లో నూతన ఉత్సాహం నెలకొంది.



మాట్లాడుతున్న సిఐ శంకరరావు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని కాశీబుగ్గ రూరల్ సిఐ జి.శంకరరావు అన్నారు. ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశాలు మేరకు కమ్యూనిటీ పోలీస్‌లో భాగంగా గురువారం గోవిందపురం ఉన్నత పాఠశాల మైదానంలో ఎస్‌పి కప్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రీడాస్ఫూర్తితో మెలగాన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించే మానసిక దృఢత్వం జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. గ్రామీణ క్రీడల ద్వారా గ్రామీణ యువతలో నిభిడీకృతంగా ఉన్న ప్రతిభ వెలికి తీయవచ్చు అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి క్రీడా కోటాలో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ప్రతిభతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు అన్నారు. క్రికెట్, వాలీబాల్ రెండు విభాగాల్లో క్రికెట్‌కు 16, వాలీబాల్‌కు 18 జట్లు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.మధుసూదన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్



ప్రారంభిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి సమీకృత బాలికల వసతిగృహాంలో ఆర్ఒ ప్లాంట్ టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు పంచాయతీలో స్టార్ గ్రానైట్స్ యజమాని దిలీప్ సింగ్ రాథోడ్ రూ. 2 లక్షలు ఆర్ఒ ప్లాంట్ వితరణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటిని శుద్ధి చేసి తాగునీరు అందించిన రాథోడ్ని అభినందించారు పిల్లలకు మంచినీరు సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందదాయకమన్నారు. విద్యార్థులతో సేవ్ వాటర్ సేవ్ ఫ్యూచర్ అని నినాదాలు చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి దివ్వెల ప్రసాదరావు, వార్డెన్ గురువెల్లి వెంకట విజయలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

కాశీబుగ్గ, సోంపేటలో పోస్టల్ ఫ్రాంచైజీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తపాలశాఖ సేవలు మరింత విస్తృతం చేయడానికి జిల్లాలోని కాశీబుగ్గ, సోంపేట పట్టణాల్లో ఫ్రాంచైజీలను ఏర్పాటు చేసి సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని పోస్టల్ సూపరింటెండెంట్ కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రాంచైజీల రూపంలో తపాల స్టాంపులు కవర్లు విక్రయాలు, రిజిస్టర్ లెటర్లు, పార్శిల్లు, మనియార్డర్లు, స్పీడ్ పోస్ట్ బుక్ చేయడం వంటి సేవలను నిర్వహించేందుకు వీలు కల్పించారు. అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఏప్రిల్ 10లోగా సూపరింటెండెంట్ అఫ్ పోస్ట్ ఆఫీస్, శ్రీకాకుళం డివిజన్, శ్రీకాకుళం-532 001 కార్యాలయానికి పంపించాలని కోరారు. దరఖాస్తులకు కాశీబుగ్గ, సోంపేట ఎస్‌ఎలను, శ్రీకాకుళం సూపరింటెండెంట్ కార్యాలయాన్ని గని సంప్రదించాలన్నారు. గుర్తింపు పొందిన పాఠశాలలో ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత పొంది 18 ఏళ్లు నిండినవారై ఉండాలఅన్నారు. పోస్టల్ పెన్షనర్లకు, కంప్యూటర్ సౌకర్యం అందించగల అభ్యర్థులకు ప్రాముఖ్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులు రూ.5000 సెక్యూరిటి డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు శ్రీకాకుళంలోని ప్రధాన పోస్టాఫీసును సంప్రదించాలని కోరారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

చెరువులు అక్రమార్కుల చేతిలో పడి గోతులుగా మారి గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలోని రాధాకృష్ణాపురానికి ఆనుకుని సర్వే నంబరు 179లో వైద్యుల నరసయ్య చెరువు 4.38 సెంట్లు విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువుపై గ్రావెల్ అక్రమార్కుల కన్ను పడడంతో చెరువు బక్క చిక్కి శల్యమైపోతుంది. ప్రభుత్వం ఇసుక, మట్టి అనుమతులు ఇవ్వకపోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా రెచ్చిపోతున్నారు. 2005 వాల్టా చట్టం ప్రకారం చెరువు గర్భాల్లో ఎటువంటి తవ్వకాలు జరపకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. కానీ, అక్రమార్కులు వాటిని ధిక్కరించి యథేచ్ఛగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించాల్సిన అధికారులు వాటిని తుంగలో తొక్కడం పర్యావరణ ప్రేమికులు ఆక్షేపిస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన మండల రెవెన్యూ అధికారులు అక్రమార్కుల వెనక ఉండి ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి కారణం వారం రోజులుగా రాత్రి, పగలు అని తేడా లేకుండా యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. రెవెన్యూ, అధికారులు, సచివాలయ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని చుట్టుపక్కల గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై జిల్లా అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ ఎన్.గణపతిని వివరణ కోరగా... మండలంలో గ్రావెల్ తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, ఒకవేళ ఎవరైనా గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



గ్రావెల్‌ను తవ్వుతున్న అక్రమార్కులు

పాలబండ చెరువు గట్టుపై మళ్లీ ఆక్రమణలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ నడిబొడ్డున 12వ వార్డు పరిధిలో ఉన్న కృష్ణాపురం రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 129లో 5.27 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాలబండ చెరువు గట్టుపై ముచ్చటగా మూడోసారి ఆక్రమణదారులు షాపులను ఏర్పాటు చేయడం కలకలం రేపింది. ఇప్పటికే రెండుసార్లు ఆక్రమణదారులు అక్కడ బడ్డీలను పెట్టడం, వాటిని రెవెన్యూ అధికారుల తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే బుధవారం అర్ధరాత్రి ఆక్రమణదారులు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించి అదే స్థలంలో ముచ్చటగా మూడోసారి బడ్డీలను ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారుల ఆదేశాలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఆక్రమణదారులు వ్యవహరిస్తుండడం పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన నాయకులు ఇటువంటి ఆక్రమణలను ప్రోత్సహించడం దేనికి సంకేతమని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఓ మాజీ కౌన్సిలర్ ఈ కథకు సూత్రధారి, పాత్రధారిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు గర్భాలను ఆక్రమించకూడదని 2005 వాల్టా చట్టం ప్రకారం దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నా... వాటిని నాయకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పర్యావరణ ప్రేమికులు విమర్శిస్తున్నారు. గతంలో కూడా పట్టణంలోని పెద్ద చెరువును అప్పటి నాయకులు ఆక్రమణదారులకు దారాధత్తం చేయడంతో ఇప్పుడు చినుకు పడితే డ్రెయినేజీ నీరు రోడ్డుపై ప్రవహించి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నదని గుర్తుచేస్తున్నారు. నాయకులు, అధికారులు కలిసి చురువులు ఆక్రమణలకు గురికాకుండా ఓ కమిటీని వేసినా దాని జాడే కనిపించడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఆక్రమణలకు ఇప్పటికైనా నాయకులు అధికారులు నియంత్రించకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని ప్రజలు చర్చించుకుంటున్నారు.



పాలబండ చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన బడ్డీలు

తహశీల్దార్ వివరణ

ఇదే విషయమై తహశీల్దార్ ఎస్.గణపతిని వివరణ కోరగా, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బందిని పంపించి ఆక్రమణలను వెంటనే తొలగిస్తామని తెలిపారు. ఇది వరకే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశాం.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస : సీజన్ వ్యాధులపై విద్యార్థులకు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ కె.వి.రత్నం అన్నారు. మండలంలోని చిట్టివలసలో ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకంలో భాగంగా సీజనల్ వ్యాధుల నిర్మూలన, స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపిల్లలలో ఎక్కువగా డయేరియా, కోరింత దగ్గు, మశూచి, టైఫాయిడ్, పోలియో, మలేరియా తదితర వ్యాధులు వ్యాపిస్తున్నాయని అన్నారు. ఇవి మనిషి నుంచి మనిషికి ఈగలు, దోమలు ఇతర జంతువుల నుంచి వ్యాప్తి చెందుతాయని అన్నారు. వీటి నివారణ మన చేతుల్లోనే ఉందని అన్నారు. పౌష్టికాహారం అలాగే తాగేనీరు, పీల్చే గాలి, చుట్టుపక్కల పర్యావరణంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. అందుకే పిల్లలను సరియైన రీతిలో తగు జాగ్రత్తలు తీసుకున్నట్లయితే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. మధ్యాహ్నం కార్యక్రమంలో భాగంగా శివాని ఇంజినీరింగ్ కాలేజ్ డైరెక్టర్ సనపల నరసింగరావు ఒత్తిడిని ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు స్కూల్ పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి జె.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నర్సింగరావు



పనులను ప్రారంభిస్తున్న ఢిల్లేశ్వరరావు

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోటలో ఎస్‌సి శ్మశాన వాటిక అభివృద్ధి పనులను టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.4.95 లక్షల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, వార్డు మెంబర్ ప్రీతినిధి బోనెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం



సౌమ్య

పొందూరు: మండలంలోని లోలుగు కెజిబివిలో ఆరు, ఏడు, ఎనిమిది, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల రేజేటి సౌమ్య ఒక ప్రకటనలో కోరారు. కెజిబివిలో చదువుకోవాలనే ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థినులు తప్పనిసరిగా పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ కార్డుల జిరాక్స్, రేషన్ కార్డు, తల్లి బ్యాంకు ఖాతా, కుల ధ్రువీకరణ పత్రం, కాంటాక్ట్ ఫోన్ నంబరుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాలలో తమను సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు కిరణకుమారి

సోంపేట: మండలంలోని మామిడిపల్లికి చెందిన లండ కిరణకుమారి అనే విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సురేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫ్లోర్ కర్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించినట్లు తెలిపారు. మే నెలలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఆమె ఎంపిక కావడంపై ఆమె తండ్రి సూర్యనారాయణ, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.



అభినందిస్తున్న కోచ్ సురేందర్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న గిరిజనులు

బంద్‌ను విజయవంతం చేయాలి

కొత్తూరు : బోయ, బెంతురియా, వాల్మీకులను ఎస్‌టి జాబితాలోకి తీసుకురావడానికి వీల్లేదని, ఇటీవల అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బంద్‌ను నిర్వహిస్తున్నామని, గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు లబ్బ పంచాయతీ దొండమానుగూడ, అడ్డాయిగూడ గ్రామాల్లో గురువారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిగతా తరగతులను ఎస్‌టి జాబితాలో చేర్చితే నిజమైన గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అంసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం అన్యాయమన్నారు. దీనిపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఎంపిటిసి మాజీ సభ్యుడు మృతి

ప్రజాశక్తి- పలాస



శ్రీనివాసరావు(ఫైల్)

మండలంలోని లక్ష్మీపురానికి చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు దువ్వాడ శ్రీనివాసరావు (51) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు 2001 నుంచి రెండు సార్లు లక్ష్మీపురం ప్రాదేశిక నుంచి ఎంపిటిసిగా గెలుపొంది సేవలు అందించారు. అలాగే వైస్ ఎంపిపిగా పనిచేశారు. రాత్రి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే పలాసలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడుకు భార్య లక్ష్మి, దేవరాజ్ తరుణ్ రాజ్ ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మి ప్రస్తుతం ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. యుటిఎఫ్‌లో కీలకపాత్ర పోషిస్తున్నారు. శ్రీనివాసరావు మృతిపై మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బాబూరావు, టిడిపి నాయకులు వెడల్ కామేశ్వరరావు గాలి కృష్ణారావు గురించ సూర్యనారాయణ, విఠల్‌రావు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, వైద్యులు దువ్వాడ జీవితేశ్వరరావు, అధిక సంఖ్యలో నాయకులు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. మతుడు తల్లి దువ్వాడ నాగావళి గతంలో టెక్కలి ఎమ్మెల్యే ఎన్నికై సేవలందించారు. తండ్రి దువ్వాడ కృష్ణమూర్తి నాయుడు మాజీ సమితి అధ్యక్షులు, మాజీ ఎంపిపిగా పనిచేశారు. టిడిపి హయాంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు.



జైన స్థావరాలను తిలకిస్తున్న విద్యార్థులు

చారిత్రాత్మక ప్రదేశాల సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పి.ఎన్.కాలనీలో ఉన్న స్థానిక న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు యువటూరిజం క్లబ్ ఆధ్వర్యాన జిల్లాలోని చారిత్రిక ప్రదేశాలైన సంగమేశ్వరాలయం, పాండవుల మెట్ట తదితర ప్రదేశాలను గురువారం సందర్శించారు. వారికి పాఠశాల కో-ఆర్డినేటర్, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు డివిఎన్ పట్నాయక్ ఆ ప్రదేశాల చారిత్రిక వైభవాన్ని, ప్రసిద్ధిలో ఉన్న కథలను, వాటికి ఆ పేరు వచ్చే కారణాన్ని వివరించారు. సుమారు 50 మందికి పైగా విద్యార్థులు ఆ ప్రదేశాల గొప్పతనాన్ని తెలుసుకొని ఆనందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల యువ టూరిజం క్లబ్ కో-ఆర్డినేటర్ సంతోష్‌కుమార్, సుజాత, విజయలక్ష్మి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రాములమ్మ

జగన్నాథపురంలో పారిశుధ్య పనులు

సంతబొమ్మాళి : జగన్నాథపురంలో సర్పంచ్ జోగి రాములమ్మ ఆధ్వర్యాన గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. కాలువల్లో పూడికతీత తీశారు. గ్రామంలోని చెత్తా చెదారం ఎత్తి గ్రామానికి దూరంగా వేశారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలిలో ఫ్లెక్సీల కలకలం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వరకు ఉన్న రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదస్పదంగా మారాయి. గురువారం ఉదయం ఈ కలకలం స్థానికంగా చర్చనీయాంశమైంది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుక ఈ నెల 27న నిర్వహించారు. ఈ సందర్భంగా అబిమానులు ఫ్లెక్సీలు తయారు చేసి రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేశారు. అయితే గురువారం ఉదయం వాటి స్థానంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఒక పక్క రాముని ఫొటో, మరో పక్క దువ్వాడ ఫొటోతో కూడిన ఫ్లెక్సీలు వెలిశాయి. దీంతో టిడిపి నాయకులు ఆగ్రహానికి గురై నిరసన తెలిపారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఐ-2 రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, మట్ట పురుషోత్తం, బెహరా కాళి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, మెండ దమయంతి, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్ చంద్, కోళ్ల లవకుమార్ పాల్గొన్నారు.



టిడిపి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై వైసిపి నేతల ఫ్లెక్సీలు

ఇరుకు రోడ్లలో తప్పని అవస్థలు



అవస్థలు పడుతున్న విద్యార్థులు

బూర్జ: ఇరుకు రోడ్లలో బూర్జ గ్రామస్తులకు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. మొదటే ఇరుకు రోడ్డు ఆ రోడ్లపై రాత్రి, పగలు అని తేడా లేకుండా అనునిత్యం భారీ లోడ్లలో చెరుకు ట్రాక్టర్లు, ఇసుక లారీలు, తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ వాహనాలు మితిమీరిన వేగంతో నడుపుతుండడంతో ప్రమాదాలు సంభవించిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఇరుకు రోడ్డుపై లేకపోవడం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అలాగే భారీ వాహనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సంఘటితంగా పోరాటానికి సిద్ధం కావాలని ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ నాయకులు ప్రశాంత పోరిక్ష, కరుగ సబర్, ప్రతాప్ ప్రధాన్‌లు పిలుపునిచ్చారు. గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలోని టౌన్ హల్‌లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర తొలి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ఉద్యోగ భద్రతను నాశనం చేయడానికి టేకేదరీ వ్యవస్థను కొనసాగిస్తుందన్నారు. రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను సంఘటితం చేయడం, కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నేషనల్ వైస్ ప్రెసిడెంట్ వి.కె.పటేల్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు బాలచంద్ర సడంగి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంత పోరిక్ష

అనంతరం 14 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ప్రతాప్ ప్రధాన్, ప్రధాన కార్యదర్శిగా అగందర్ నాయక్, కార్యదర్శిగా ఉత్తమ్‌నాయక్, ఉపాధ్యక్షులుగా కరుగ సబర్‌లను ఎన్నుకున్నారు. ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ పిలుపు మేరకు తిరుపతిలో ఏప్రిల్ 13, 14, 15 తేదీలోల నిర్వహించనున్న జాతీయ మహాసభల నుంచి 20 మంది ప్రతినిధులు వెళ్లాలని తీర్మానించారు. అలాగే ఒడిశాలో జరుగుతున్న వివిధ సమస్యలపై ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టాలని తీర్మానించారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం

కంచిలి: మండలంలోని శ్రీరాంపురానికి చెందిన లండ యోగేంద్ర ఐదేళ్ల కుమారుడు కేన్సర్‌తో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో అతడి ఆపరేషన్‌కు తల్లిదండ్రులు చేయూత అందించే వ్యక్తుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సిక్కోలు ఉద్దానం సేవాసమితి సభ్యులు గురువారం బాలుడి కుటుంబ సభ్యులకు రూ.పది వేలు ఆర్థికసాయం గురువారం ఆర్థికసాయం అందజేశారు. అలాగే భైరిపురానికి చెందిన రేస్ ఫౌండేషన్ నిర్వాహకుడు పుల్లట ప్రవీణ్ స్పందించి తమ ప్రతినిధుల ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. బాలుడికి మెరుగైన చికిత్స అందించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్‌లోని ఆస్పత్రిని సందర్శించినట్లు తెలిపారు భవిష్యత్‌లో బాలుడికి చికిత్స అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కామేష్‌రెడ్డి, మాదిన ప్రదీప్, పి.అనిల్, వేణు, హరి, శరత్, జి.రవి, మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

5 నుంచి శిక్షణా తరగతులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుగంధర్

పోలాకి : ఏప్రిల్ 5, 6 తేదీల్లో నరసన్నపేట మండల కేంద్రంలో జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు నరసన్నపేట ఎస్‌సి హాస్టల్‌లో శిక్షణా తరగతుల పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా నలుమూల నుంచి వంద మంది యువకులు హాజరవుతారని అన్నారు. ఈ శిక్షణా తరగతులకు ఎఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు, జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రాజేంద్ర, ఎన్.లెనిన్‌బాబు పాల్గొంటారని తెలిపారు.



పలాస : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని చిన్నబొందిలీపురం, బాయమ్మ తోటల్లో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, పూర్ణచంద్రదాస్‌రెడ్డి శంకర్, రాయి కిరణ్, తాడి సూరి పాల్గొన్నారు. అలాగే బలగ సత్యసాయినగర్, విశాఖ-బి కాలనీలో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ మధుకర్ విలేకర్ ఆధ్వర్యాన నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అంబటి రంగారావు, ఇప్పిలి భవాని, జమునాదేవి, వాకర్స్ ఇంటర్నేషనల్ 102 డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్, సత్సంగ సభ్యులు, శ్రీవిష్ణు పాల్గొన్నారు.

జి.సిగడాం : మండలంలోని జి.సిగడాం, ఆనందపురం, మధుపాం, డి.ఆర్.వలస గ్రామాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించారు. సాయంత్రం మధుపాంలో చిన్నారులు నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రణస్థలం రూరల్ : శ్రీరామ నవమి సందర్భంగా దన్నానపేట, తిరపాతిపాలెం, పున్నసపాలెం, కోష్ట, కోటపాలెం, దేవరాపల్లి, అర్జునవలస, గిరివానిపాలెం, వేల్పురాయి, కొండములగాం, పైడిభీమవరం, పాతర్లపల్లి, దేరాసాం, రావాడ, తెప్పలవలస అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దన్నానపేటలో ఎంపిటిసి ప్రతినిధి పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన లక్ష్మణరావు, దన్నాన శ్రీరాములు, మేకా శ్రీనివాస్, దన్నాన సత్యం, అప్పలనాయుడు, యలకల బలరాం పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ, మొగిలిపాడు, బ్రాహ్మణతర్ల, కృష్ణపురం గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఐదు వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొత్తూరు : మండలంలోని పారాపురంలో శ్రీరామ నవమి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దలు బసవ రాంబాబు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ, కవిటి, కె.కొత్తూరు, డొంకపుట్టుగ, బొరివంక గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ఎమ్మెల్యే బెందాళం అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన సంగీతలహరి అందరినీ అలరించింది.



దన్నానపేటలో అన్నదానం చేస్తున్న మేకా శ్రీనివాస్

బూర్జ : మండలంలోని అల్లెన పంచాయతీ గంగాభగీరథపురంలో ఉన్న కోదండ సీతారామ ఆలయంలో సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్సాస్ సిఇఒ గేదెల శ్రీనుబాబు, అనిత దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. చినలంకాం, తోటవాడ, జీడివలస గ్రామాల్లో శ్రీరామ నవమి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం, కోసమాల, సుర్జిని, భావనాపురం, గొప్పిలి గ్రామాల్లో శ్రీరామ నవమిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నందిగాం : మండలంలోని మొండిగావలస, పెంటఊరు, బెజ్జపల్లి, హరిదాసుపురం, సుభద్రాపురం, కొండతెంబూరు తదితర గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యాక్రమాల్లో ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి అంబోడి విష్ణు, కూరమాన ఉత్తంకుమార్, సర్పంచ్‌లు శంభాన దానయ్య, బోరుభద్ర సోమేశ్వరరావు పాల్గొన్నారు.



జి.సిగడాం : కోలాటంలో పాల్గొన్న చిన్నారులు

కోటబొమ్మాళి : మండలం ఊడికలపాడు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సనపల కరుణ్‌కుమార్, ఎంపిటిసి బొడ్డు అప్పన్న, హనుమంతు వెంకటరావు, మెండ తిరుపతిరావు, నేతింటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. చిన్నహరిశ్చంద్రపురం, గంగరాం, వెంకన్నపేట, యలమంచిలి, చిట్టేవలస, చవితిపేట, సుబ్బారావుపేట, కోటబొమ్మాళి గ్రామాల్లో నవమి వేడుకల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలాకి: శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని వెదుళ్లవలస, తోటాడ, పోలాకి, నరసాపురం గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యారబాటి వేణు, యారబాటి వాసు, ఎం.చిన్నంనాయిడు, ఎం.వెంకట అప్పలనాయుడు, వై.ప్రవీణ పాల్గొన్నారు.